

# అమ్మ

మన్నెం శారద

"రైలెక్కబోతూండగా అనుకోకుండా నా చెయ్యి స్లిప్పయ్యింది. పడిపోయానే అనుకున్నాను. మరుక్షణం ఒక బలమైన చెయ్యి నన్ను పైకి లాగింది. ఒక్క ఊపున కంపార్టుమెంటులో పడ్డాను. నా చేతిలోని సూట్‌కేసుని కూడా ఆ చెయ్యి అందుకొని "ఎక్కడ మీ బెర్త్?" అనడిగింది.

"ఫిఫ్టీ సిక్స్" అని చెబుతూ నాకు సహాయం అందించిన చెయ్యి తాలూకు వ్యక్తివైపు చూశాను. అతడు నా సూట్‌కేస్‌ని బెర్త్ మీద పెడుతూ వెనుతిరిగి చూశాడు.

చూడగానే నన్ను నేను మరచిపోయేను.

నా కళ్ళలో అద్వితీయమైన మెరుపు మెరిసినట్లయింది.

అతని వయసు పాతిక దాటి వుండొచ్చు. గులాబీలు, మేలిమి బంగారం కలిపి పోత పోసినట్లు మేని ఛాయ, నల్లని ఉంగరాల జుత్తు, గులాబి రంగు పెదవులపై నల్లని మీసం, మెరిసే కళ్ళు, ఆరడుగుల పొడవు, పొడవుకు తగిన బలిష్టమైన శరీరం. దానికి అందాన్ని కూర్చే ఖరీదైన దుస్తులు - నా జీవితంలో మొట్టమొదటి సారి అంత అందాన్ని చూశాను.

అతను నవ్వినప్పుడు అతని రోజా రంగు పెదవులతో సమానంగా సాగిన మీసం అతని పెదవులకి పెట్టిన నగిషీలా వుంది. కళ్ళు కొద్దిగా చిన్నవయి మరింత తళుక్కుమన్నాయి.

"థాంక్స్ బాబూ" అన్నాను.

"వెల్‌కమ్" అన్నాడతను నా ఎదుటి సీట్లో కూర్చుంటూ.

"ఎక్కడిదాకా ఆంటీ?" అన్నాడతను.

"బెంగళూరు. మా అబ్బాయిని అక్కడ ఇంజనీరింగులో జాయిన్ చేసేం" అన్నాను.

"నేనూ బెంగళూరే! అక్కడ బిజినెస్" అన్నాడు.

నేను తల పంకించి నాకూడా తెచ్చుకున్న పుస్తకం తెరచి చదవాలని ప్రయత్నించాను. కాని మనసు దానిమీద లగ్నం కావటం లేదు. రైలుకన్నా వేగంగా నా మనసు బెంగుళూరులోని మా అబ్బాయిని చూడాలని పరిగెత్తుతోంది. పుట్టేక వాణ్ణిదే మొదటిసారి వదిలివుండటం. వెళ్ళే టప్పుడు నేను ఏడ్చిన ఏడుపు చూసి మావాడు "నేను వెళ్ళనమ్మా" అన్నాడు దిగులుగా మొహం పెట్టి.


"సరే మానెయ్యరా! మీ అమ్మకి నీ భవిష్యత్తు కన్నా, నువ్వు దగ్గరుండటమే ముఖ్యంలా వుంది" అన్నారు మావారు.

అందులోని నిష్ఠూరం గ్రహించి కళ్ళ నీళ్ళు ఆపుకోవాలని వృథా ప్రయత్నం చేసాను. కాని అవి ఆగటం లేదు.

"లేదండీ! వాణ్ణి పంపించండి. వాణ్ణెప్పుడూ వదలి వుండలేదేమో బాగా ఏడుపొస్తున్నది" అన్నాన వంటగదిలో కెళ్ళిపోతూ.

నా బాధ గ్రహించి ఆయనా వంట గదిలో కొచ్చేరు.

"చూడు సౌమ్యా! తల్లిగా నీ బాధ నాకర్థం కానిది కాదు. కాని ప్రేమలో పడి వాస్తవాల్ని మరచిపోకూడదు. మగపిల్లలు ఇప్పుడు చదువు నెపంతో, తర్వాత పెళ్ళి కావడంతో మనకి శారీరకంగా మానసికంగా దూరం అవడం ప్రారంభిస్తారు. ఈ నిజాన్ని మనం అంగీకరించలేకపోతే చాలా సమస్యలు తలెత్తుతాయి. పశువులు,



పక్షులు తమ సంతానం ఆహారం సంపాదించుకోవడం ప్రారంభించగానే వాటి దారిన వాటిని వదిలేస్తాయి. మన మనుష్యులమే సెంటిమెంట్స్ పేరుతో ఉన్న సంతోషాన్ని పోగొట్టుకొంటాం. నువ్వు కొంచెం పాజిటివ్‌గా ఆలోచించడం నేర్చుకో" అన్నారు.

"నాక్కొంచెం టైము కావాలి. ఈ విషయాలన్నీ

నాకు తెలియనివి కావు" అన్నాను ఏడుస్తూనే.

"నువ్వలా ఏడిస్తే వాడు కూడా వెళ్ళలేడు. వాడు కూడా ఇదే ప్రధమం కదా నిన్నొదిలి వెళ్ళడం!" అన్నారాయన.

నేను బలవంతంగా కళ్ళు తుడుచుకుని వంట గదిలోంచి బయటికొచ్చి "చూడు నాన్నా! నువ్వు బాగా చదువుకొని గొప్పవాడికి కావాలి. నీకెప్పుడు నాతో మాట్లాడాలనిపించినా వెంటనే ఫోను చెయ్యి. బెంగళూరు గార్డెన్ సిటీ అంటారు. చాలా బాగుంటుందట అక్కడి వాతావరణం. మంచి స్నేహాలు చెయ్యి. అక్కడికి చదువుకోవడానికి వెళ్ళేనన్న సంగతి మాత్రం గుర్తు పెట్టుకో" అని చెప్పాను.



వాడు బుద్ధిగా తల ఊపేడు. వాడి కళ్ళల్లో నీలి నీడలు దోబూచులాడటం నా దృష్టిలో పడుతూనే వుంది.

వస్తోన్న దుఃఖాన్ని ఆపుకొని ఆయన వెంట వాణ్ణి పంపించేను. నేను అప్‌సెట్టవుతానని ఆయన నన్ను స్టేషన్‌కి రావద్దన్నారు. వాళ్ళిద్దరూ ఎక్కిన ఆటో బయల్దేరగానే నేను లోపలికొచ్చి తలుపేసుకొని మంచమ్మీద పడి బావురుమన్నాను. కాలం ఎంత గడిచిందో తెలీదు. కళ్ళు వాచి మంకెన పూలయిపోతున్నాయి. అయినా దుఃఖం వర్షాకాలపు వాగులా కళ్ళనుండి దూకుతూనే వుంది.

వాడు పుట్టిన నాటి సంగతులు, పసితనంలో వాడి ముద్దు ముద్దు మాటలు, అల్లరి - అన్నీ సినిమా రీళ్ళలా మస్తిష్కాన్ని తొలిచేస్తున్నాయి.

వాణ్ణి అక్కడ జాయిన్ చేసి తిరిగొచ్చిన ఆయన నన్ను చూసి విస్తుపోతూ "సౌమ్యా ఏమిటిలా అయిపోయావు? జ్వరమొచ్చిందా?" అన్నారు వంటిమీద చెయ్యి వేసి చూస్తూ.

"ఏంలేదు. వాడెలా వున్నాడు! మీరొచ్చేస్తూంటే ఏడ్చాడా?" అనడిగాను ఆత్రుతగా.

"అదేం లేదు. వాడితో ఇక్కడ చదువుకున్న ఫ్రెండ్స్ కొంతమంది అక్కడ జాయినయ్యారు. వాళ్ళ రూమ్‌లోనే జేర్చేను. వాడప్పుడే వాడి లోకంలో పడిపోయాడు. నువ్వే ఏదో జరగరానిది జరిగినట్లేడుస్తూ కూర్చున్నావు" అన్నారు కొంచెం చిరాకుపడుతూ.

వాడక్కడ బాగానే ఎడ్జస్టయ్యేడన్న వార్త నాకు కొంత ఊరట కల్గించింది. అయినా దిగులు నా మనసుని జలగలా పట్టి పీడిస్తూనే వుంది. ఎక్కడ చూసినా వాడి గుర్తులే. 'అమ్మా' అని వాడు పిలిచినట్లయి ఉలిక్కిపడుతున్నాను. ఆ రాత్రి వాడు ఫోనులో మాట్లాడాడు. కాస్సేపు హాయనిపించింది.

ఆయన కూడా నేను ఒంటరితనంతో బాధపడుతున్నానని ఇంటికి త్వరగా వచ్చి ఎక్కడికో ఓ చోటికి తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు రారమ్మన్నా వీలు కుదరక వెళ్ళని బంధువులు, స్నేహితుల ఇళ్ళన్నీ చుట్టబెట్టేసేం.

ఒకరోజు ఆయన న్నారు "నువ్వొకప్పుడు మంచి ఆర్టిస్టువి. నేను పెయింట్స్ బ్రష్షులు తెచ్చిస్తాను. తిరిగి మొదలుపెట్టు" అని.

నేను ఒప్పుకున్నాను.

పెయింటింగ్‌లో పడితే కాలమే తెలియదు. మనసు ఈ లౌకిక విషయాల్ని పూర్తిగా విస్మరిస్తుంది. ఎప్పుడయినా రాత్రి పూటయినా బాబు గుర్తొచ్చినా మునుపటంతటి దుఃఖం రాదు.

బాబు వెళ్ళి మూడు నెలలయింది. ఈమధ్య వాణ్ణి చూడాలనిపిస్తోంది మాటి మాటికి. నా బాధ గ్రహించి ఆయనే అన్నారు.

"ఒకసారి వెళ్ళు. వాణ్ణీ - బెంగళూరుని చూసినట్లుంటుంది."

అంతే!

నేను ఎగిరి గంతేసేను. ఆయన వెళ్ళి టిక్కెట్ రిజర్వు చేసుకొచ్చేరు. ఎస్.టెన్. కోచ్ ప్లాట్‌ఫారమ్‌కి కాస్త దిగువుగా వుండటం వలన ఎక్కలేకపోయాను. ఈమధ్య కాస్త వళ్ళు కూడా వచ్చింది. ఒకప్పుడు మా అమ్మమ్మ తిట్టి పోసినా చెట్ల మీద్ ఉండేదాన్ని.

"ఆడపిల్లవి. సిగ్గు లేకుండా చెట్టెక్కుతావేంటే? ఎవరన్నా చూస్తే షుర్యాటగా వుంటుందా?" అని లబలబలాడేది.

నాకిప్పుడు తలచుకుంటే నవ్వొస్తుంది. అప్పుడు నాకు నిండా పదేళ్ళు కూడా లేవు. పైగా మా ఇంటి వెనుక రెండకరాల స్థలంలో అన్నిరకాల చెట్లూ వుండేవి.

మా ఆడపిల్లలందరికీ అదే ప్రపంచం. అక్కడ కూడా గట్టిగా నవ్వకూడదని, ఆడకూడదని - ఎగరకూడదని ఎన్నో నిబంధనలు. అంత గట్టి నిబంధనల మధ్యన కూడా మేం చదువుకున్నాం. పెయింటింగు నేర్చుకున్నాం. డాన్సులు చేసేవాళ్ళం - చాలా రహస్యంగా.

ఇప్పటి తరానికున్న స్వేచ్ఛ వుంటే మేమింకా ఎన్ని రంగాల్లో రాణించేవాళ్ళమో అనుకుంటా అప్పుడప్పుడూ.

"ఆంటీ!"

నేను నా ఆలోచనల నుండి బయటపడి చూశాను.

ఎదురుగా కూర్చున్న అబ్బాయి రెండు కూల్ డ్రింకులు తీసుకొని ఒకటి నాకు ఆఫర్ చేసేడు.

సభ్యతకి తీసుకుని "నీ పేరేంటి?" అనడిగేను.

"మకరంద్" అన్నాడతను.

"చాలా బాగుంది" అన్నాను.

మళ్ళీ ఆ అబ్బాయి నవ్వాడు.

ఎదుటి మనసుకి గాలం వేసినట్లుందతని నవ్వు.

నాకు మావాడు గుర్తొచ్చేడు. తల్లిని నేనను కోకూడదు గాని వాడు కూడా అందగాడే! ఇప్పుడు వాడికి పదిహేను నిండాయి. ఇంకో అయిదారేళ్ళు పోతే వాడు కూడా ఇలానే వుంటాడేమో! ఇప్పుడు కండపట్టని మామిడి టెంకలా వున్నాడు. వయసొస్తే వళ్ళు చేసి అచ్చం మకరంద్‌లానే...' నాలోని తల్లి హృదయం ఆలోచిస్తున్నది.

తెలియకుండానే ఎదుటి అబ్బాయిని కూడా నా మనసు పుత్రవాత్సల్యంతో చూస్తున్నది.

కాస్సేపటికి మేం పిచ్చాపాటి కబుర్లలో పడ్డాం. అతను నేను వద్దన్నా ఏదో ఒకటి ఆఫర్ చేస్తూనే వున్నాడు. రాత్రయింది. బెర్త్‌లు పరచుకున్నాం. నాది క్రింద బెర్త్, అతనిది మిడిల్ బెర్త్.

మావాడి గురించి ఆలోచిస్తూ నేను నిద్రలోకి జారుకున్నాను.

మధ్య రాత్రి ఏదో పాకినట్లయి నేను ఉలిక్కిపడి లేచాను. పై బెర్త్ మీద మకరంద్ చెయ్యి క్రిందికి వ్రేలాడుతూ నాకు తగులుతోంది... నేను ఒకసారి లేచి 'మకరంద్!' అని పిలిచేను. అతనీ లోకంలో లేనట్లుగా బోర్ల పడుకుని నిద్రపోతున్నాడు.

నేను టాయిలెట్‌కి వెళ్ళొచ్చి తిరిగి పడుకున్నాను.

రాత్రంతా అతని చెయ్యి తగిలినప్పుడల్లా

ఉలిక్కిపడుతూనే వున్నాను.

తెల్లారింది నేను బ్రష్ చేసుకుని వచ్చి కూర్చున్నాను. మకరంద్ కూడా మొహం కడుక్కుని వచ్చాడు. ఇద్దరం కాఫీ తాగాం.

మకరంద్ నావంక చూసి నవ్వి "బెంగళూరులో ఎక్కడ దిగుతారు?" అన్నాడు.

"మావాడి హాస్టల్‌కే వెళ్ళిపోతాను" అన్నాను.

"అలా ఎందుకు, నా రూమ్‌కు రండి. ఫ్రెషప్పయ్యేక నేను తీసుకెళ్తాను మీ అబ్బాయి దగ్గరకి" అన్నాడు.

"లేదు. వాణ్ణి వెంటనే చూడా"లని అన్నాను.

మకరంద్ అదోలా నవ్వి జేబులోంచి పర్సు తీసి డబ్బు లెక్కపెట్టుకున్నాడు. అతని చేతిలోంచి డబ్బు కట్ట జారి క్రిందపడి చెల్లా చెదురయింది.

నేను గభాల్న కొంత ఏరి అతడికందించేను.

అన్నీ అయిదొందల రూపాయిల నోట్లే.

"అంత నిర్లక్ష్యమేమిటి, డబ్బు దగ్గర!" అన్నాను చనువుగా

"ఫర్వాలేదు. నా రోజు ఖర్చే రెండు వేలుంటుంది" అన్నాడు మకరంద్. ఆ జవాబులో కొంచెం అహం ధ్వనించింది.

నేను తెల్లబోతూ "ఎందుకంత ఖర్చవుతుంది?" అన్నాను.

మకరంద్ మళ్ళీ నవ్వాడు. ఆ నవ్వులో ఏదో తేడా వున్నట్లనిపించింది.

నిన్న రాత్రి రైలెక్కే ముందులా అనిపించడం లేదతని మొహం. అది నా భావనేమోనని సరిపెట్టుకున్నాను.

"చాలా పిచ్చిగా అడుగుతున్నారు. మనీ మేక్స్ ఆల్ ది థింగ్స్! సంపాదిస్తున్నాను. నా ఎంజాయ్‌మెంటుకి ఖర్చు పెట్టుకుంటున్నాను. అందుకే నాతో రండి. నా ఖర్చులెలాంటివో మీకు తెలుస్తాయి."

నాకెందుకో అతని సంభాషణా తీరు ఇబ్బందిగా అనిపించింది. హుందాగా నవ్వేసి మళ్ళీ మాగజైన్ చదవడంలో నిమగ్నమయ్యేను.

"ఏం చదువుతున్నారు?" అతను లేని చొరవ తీసుకొని నాపక్కకొచ్చి కూర్చున్నాడు, నన్ను తగులుతూ.

నా భావనలో అతను నా కొడుకు లాంటివాడు కాబట్టి అతని స్పర్శ ఇబ్బంది పెట్టడం లేదు కాని అతని చూపులే చిరాగ్గా అనిపిస్తున్నాయి. 'బిబ్యూటిఫుల్ ఇన్ ఫార్టీస్' అన్న కేప్షన్ చూసి "ఇదేనా మీ సౌందర్య రహస్యం! రియల్లీ యూ ఆర్ సో నైస్. ఈ రోజుల్లో టీన్స్ కన్నా ఆంటీలే బాగుంటున్నారు" అన్నాడు.

ఆ మాటలకి నా వళ్ళు జలదరించింది.

కోపం ఉప్పెన కెరటంలా ఉవ్వెత్తున లేచింది.

అయినా తమాయించుకొన్నాను.

"వెళ్ళి నీ సీట్లో కూర్చో" అన్నాను.

అతను బలవంతంగా లేచినట్టుగా లేచి తన సీట్లో కూర్చున్నాడు.

నేను చాలా అసహనంగా మారిపోయాను. ద్రాక్షపండని నోట్లో వేసుకుంటే వేపకాయలా మారినట్లు - రాత్రి నుండి అతనిలో ఒక కొడుకుని చూసుకున్న నేను అతని ఆకస్మిక చర్యకి నిర్ఘాంతపోయాను.

వీడు నిండా పాతికేళ్ళయి వుండదు తల్లి కడుపు నుండి ఊడిపడి,

అప్పుడే తల్లిలాంటి స్త్రీని వంకరగా చూసే శక్తి వచ్చేసింది.

రాత్రి వాడు కావాలనే నన్ను తాకడం కోసం చేతిని నిద్రలో జారినట్లు జార్చేడని - డబ్బు కూడా కావాలనే పడేసుకుని - స్త్రీ శరీరాన్ని కొనుక్కునే తాహతు వుందని తెలియబర్చేడని నాకర్థం కాగానే నా మనసంతా జుగుప్సతో నిండిపోయింది.

వయో తరతమ బేధం కూడా పట్టనంతగా బలిసిపోయింది వాడి మనసు - శరీరం.

'ఇంతసేపూ వాణ్ణి కొడుకులా భావించిన నా మనసుని నేనే తిట్టుకున్నాను. ఎప్పుడు బెంగళూరొస్తుందా' అని ముళ్ళ మీద కూర్చున్నట్టుగా కూర్చున్నాను.

బెంగళూరు మరో అరగంటలో రాగానే ప్రాణం లేచొచ్చింది. గబగబా లగేజ్ తీసుకొని వాడి మొహం కూడా చూడకుండా లేచి నిలబడ్డాను.

స్టేషన్‌లో ట్రెయినాగింది. నన్నానుకునే వాడు కావాలని నిలబడ్డాడు. వాడి స్పర్శ ముళ్ళలా గుచ్చుకుంటోంది నాకు.

"హలో! ఆంటీ! అంత కోపమేంటి, నేను హెల్ప్ చేస్తానుండండి" అన్నాడు వాడు చనువుగా నా సూట్‌కేస్ లాక్కోబోతూ.

నేను విసిరికొట్టాను.

వాడు భుజాలెగరేసి "నిజంగానే కోపం వచ్చినట్లుంది. సరే! మీకిష్టమైతే తిరిగి వెళ్ళేలోపు నా రూమ్‌కి రావొచ్చు" అంటూ వాడి విజిటింగ్ కార్డు నా బాస్కెట్‌లో పడేసాడు.

వాడి ప్రవర్తనకి నా వళ్ళు భగ్గుమంది. కాని ఏం చేయలేని నిస్సహాయ స్థితి. ప్రయాణీకులంతా దిగే హడావుడిలో వున్నారు.

నేను వాణ్ణి తప్పించుకునే నెపంతో గబగబా రైలు దిగి ప్లాట్‌ఫామ్ దాటి బయటికొచ్చేను. బెంగళూరు నాకు కొత్త. పైగా భాష రాదు. బాబుకి ఫోను చేద్దామన్నా వాడిని సర్‌ప్రయిజు చేద్దామని వాడికి తెలియబర్చకుండానే బయల్దేరాను. ఒక ఆటో డ్రైవరుకి ఎడ్రస్ చెప్పి ట్రాఫిక్ కానిస్టేబుల్ సహాయంతో ఆటో ఎక్కాను. ఆటో స్టేషన్ ప్రాంతం వదిలేక వాడి పీడా వదిలిందని హాయిగా గాలి పీల్చుకొన్నాను.

కాని ఒక వంద గజాలు వెళ్ళేక వాడి ఆటో నన్ను ఓవర్ టేక్ చేసింది. అందులోంచి మకరంద్ ముందుకి వంగి కన్ను కొట్టి ఈల వేస్తూ "బై ఆంటీ!" అన్నాడు నవ్వుతూ.

ఇంతసేపు నేను వాణ్ణి అపార్థం చేసుకుంటున్నానేమో అన్న ఆలోచన ఏ మూలో పీకుతోంది. అది పూర్తిగా వాడి ప్రవర్తనతో తుడుచుపెట్టుకు పోయింది.

వాడి కుసంస్కారానికి అసహ్యం కలిగి మొహం తిప్పుకున్నాను. నా బాధని మైమరపిస్తోంది సిటీలో

చల్లని వాతావరణం, అడుగడుగునా తోటలు - మనసు ఒక రకమైన పరవశానికి గురవుతుండగా నేనెక్కిన ఆటో కిర్రున చప్పుడు చేస్తూ ఆగిపోయింది.


ఉలిక్కిపడి "ఏం జరిగింది?" అనడిగేను ఆటో డ్రైవర్ని.

డ్రైవరు నాకు జవాబు చెప్పకుండానే రోడ్డు మీద మూగిన జనంలోకి దూసుకుపోయేడు.


ఏదో యాక్సిడెంటయినట్లుంది. అదే సిటీలో నా కొడుకు కూడా వున్నాడన్న ఊహ రాగానే ఏక్సిడెంటంటేనే భయపడి చచ్చేదాన్ని - ఒక్కసారి

### జంతువులు

ప్రపంచ వ్యాప్తంగా 20 లక్షల రకాల జంతువులు గుర్తించబడ్డాయి. వీటిలో మనిషి మచ్చిక చేసుకున్నవి 50 రకాల జంతువులు మాత్రమే. కొన్నిటిలో విశేషం ఏమిటంటే - బల్లితోక తెగితే కొత్త తోక పుడుతుంది. కంగారూ జంతువు పాలు గులాబీ రంగులో వుంటాయి. గాడిద పాలు అతి మధురంగా వుంటాయి. ఒంటె పాలు చాలా చిక్కగా వుంటాయి. ఇంకా విశేషం ఏంటంటే? ఒంటె ఒకసారి ప్రసవించాక 3 సంవత్సరాల వరకు అలా పాలిస్తూనే వుంటుంది.



### నాలుక



జ్ఞానేంద్రియాలలో కన్ను తరువాత ప్రధాన అవయవం నాలుక. ఆరోగ్యవంతుని నాలుక 6 లక్షల నీటి చుక్కలలో 2 చుక్కల ఔషధం కలిపినా తెలుసుకోగలదు. నాలుకపై 9 వేల వరకూ రుచిని తెలిపే నాడీ మొటికలుంటాయి. నాలుకలో చివరి భాగం తీపి రుచిని, ప్రక్క భాగం పులుపునీ, మధ్య భాగం చేదునీ, వెనుక భాగం కారం రుచినీ తెలుసుకోగలుగుతుంది.

- డా॥ ఎ.ఎల్.ఆర్. మూర్తి

జనంలోకి పరిగెత్తేను.

అక్కడి దృశ్యం చూసి దిగ్భ్రాంతికి గురయ్యా నొక క్షణం!

మకరంద్ రక్తపు మడుగులో వున్నాడు. మకరంద్ ఎక్కిన ఆటోని గుద్దిన లారీ పక్కకి నిలబడి వుంది. ఆటో ముక్కలయింది. అతడు తొడుక్కున్న ఖరీదైన బట్టలు తుక్కు తుక్క య్యాయి. పెట్టుకున్న గ్లాసెస్ చితికిపోయేయి. అందమైన గులాబి రంగు శరీరం కమిలి పోయింది.

అందరూ చోద్యం చూస్తున్నారు గానీ ఏం చేయడం లేదు.

నాకతని మీద వున్న అసహ్యాన్ని మానవత్వం జయి స్తోంది.

"ప్రాణమున్నదా చూడండి" అన్నాను పక్క నున్న వారి నుద్దేశించి.

"మనకెందుకు పాడు గొడవ. పోలీ సులలో న్యూసెన్స్" అన్నారెవరో.

గబగబా దగ్గరకెళ్ళి "మకరంద్ మకరంద్!" అని పిలిచేను.

అతను కొద్దిగా కదిలేడు. తల నుండి రక్తం కారుతూనే వుంది. మెల్లిగా అతను అస్పష్టంగా గొణగడం గమనించి,

"ఏంటి, మక రంధ్! ఏం కావాలి!" అన్నాను క్రింద అతని తల దగ్గర కూర్చుని.

"అమ్మా దాహం!" అన్నాడతను మెల్లిగా.

నేను గబగబా ఆటో దగ్గరకి పరిగెత్తి వాటర్ బాటిల్ తెచ్చి అతని నోట్లో నీళ్ళు పోసాను.

అతను వాటిని మింగడంతో అతను బతుకు తాడన్న ఆశ కల్గింది నాకు.

ఇంతలో పోలీసులొచ్చేరు.

అతని దగ్గరగా కూర్చున్న నన్ను చూసి "మీకు తెలుసా?" అనడిగేరు.

తల పంకించేను నేను.

వెంటనే అంబులెన్స్‌లో అతనితో పాటు హాస్పిటల్‌కి వెళ్ళేను.

రెండు రోజులు మకరంద్ చావు బ్రతుకులతో పోరాడాడు.

ప్రతి రాత్రి అతని మంచం దగ్గర కూర్చున్న నా చేతిని అపస్మారక స్థితిలోనే పట్టుకొని 'అమ్మా అమ్మా' అని మూలిగేవాడు.

నేనలాగే అతని తల నిమిరేదాన్ని. రైల్లో నా బాస్కెట్‌లో పడేసిన అతని విజిటింగ్ కార్డు వలన అతని వ్యాపార సంస్థకి జరిగిన సంగతి తెలియబరిచేను. వాళ్ళంతా వచ్చేలోపునే మకరంద్‌కి స్పృహ వచ్చింది.

తనదగ్గర నన్ను చూసి "మీరా ఆంటీ!" అనేవాడు.

"ఈ రెండు రోజులూ అమ్మనే పిలిచేవు. మళ్ళీ పిలుపు మార్చకు" అన్నాను నేను.

అతనికి తను చేసిన తప్పు గుర్తొచ్చినట్లుంది. అపరాధిలా తల దించుకొని "నన్ను క్షమించమ్మా" అన్నాడు.

"ఏక్సిడెంటయిన వెంటనే 'అమ్మా దాహం!' అన్నప్పుడే క్షమించాను" అన్నాను చిరునవ్వుతో.

"మీ అబ్బాయేడి, అతనిదగ్గర కెళ్ళలేదా మీరు!" అనడిగాడు ఆశ్చర్యంగా.

"లేదు. వాడికి నేనీ వూళ్ళో వున్నట్లే తెలి యదు."

నా జవాబు విని మకరంద్ ఆశ్చర్య పోతూ "ఫోను చెయ్యలేకపోయేరా?" అన్నాడు.

"వాడొస్తే... నా మనసటులాగి నిన్ను నీ దారికి వదిలేస్తానేమోనన్న భయంతో వాడికి తెలియబరచలేదు" అన్నాను.

నా జవాబుతో అతని కళ్ళు సజల మయ్యాయి.

"నే పెరిగిన వాతా వరణంలో స్త్రీ అంటే తేలిక భావన. అజ్ఞా నంలో వున్న నా కళ్ళు తెరిపించేవమ్మా. నీ మేలు మరచిపోను" అన్నాడు గద్గదమైన కంఠస్వరంతో.

"మరచిపోవడం కాదు. ఈ రోజు నుండి నువ్వు నా పెద్ద కొడుకువి. మా యిం టికి రావాలి" అన్నాను.

మకరంద్ స్వచ్ఛమైన మకరందం లానే నవ్వాడు.

వాళ్ళ వాళ్ళు రాగానే నేను హాస్టలుకి బయ ల్దేరాను.

ఇప్పటికీ మకరంద్ మా ఊరొచ్చినప్పుడల్లా 'అమ్మా' అంటూ వీధిలోంచే అరుస్తూ మా ఇంటికి వస్తూంటాడు. అదీ విశేషం.




## నాడు మాతమ్మ - నేడు ఆటో రాణి

మాతమ్మ వ్యవస్థ రూపుమాపడానికి జరిగిన కృషి వల్ల అనేకమంది యువతుల జీవితాల్లో వెలుగు నిండింది.

నెల్లూరు జిల్లా కలెక్టర్, 'డ్యూటీస్' సంస్థ ఛైర్మన్ నూనె వెంగయ్యల సహకారంతో అంధకార జీవితం నుంచి మాతమ్మ రాణి ఆటో రాణిగా కొత్త జీవితం ప్రారంభించింది.

మనుబోలు మండలం, జట్లు కొండూరు గ్రామంలో మాతమ్మగా జీవించే కంటేపల్లి రాణి (22)కి, 1993 ఫిబ్రవరి మాసంలో 'డ్యూటీస్' సంస్థ పునరావాసం కల్పించింది. వ్యాపార - ఉపాధి రంగాలకు సంబంధించి ఈ సంస్థ గత సంవత్సరం డిసెంబర్ 19 నుంచి ఈ సంవత్సరం జనవరి 4 వరకు జరిపిన శిక్షణా కార్యక్రమంలో రాణి పట్టుదలగా శిక్షణపొందింది. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకొన్న పాఠాలు ఆమెను పరిపూర్ణమైన మహిళగా తీర్చిదిద్దాయి.

సమాజంలో గౌరవప్రదమైన మార్గాన్ని మలచుకొన్న రాణిని ప్రభుత్వం ప్రోత్సహించింది. గూడూరులో ఆమె ఆటో నడపడంలో శిక్షణ పొందింది. జిల్లా ఎస్.సి. కార్పొరేషన్ అందజేసిన 55 వేల రూపాయల ఆర్థిక సహాయంతో ఆటోను పొంది 'ఆటో'రాణి అయ్యింది. నిరాశా, నిస్పృహలతో అంధకార జీవితంలో కొట్టుమిట్టాడే అనేకమంది పడతులకు మార్గదర్శి అయ్యింది రాణి.

ప్రపంచ జ్ఞానం, ఉన్నత విద్య లేవీ లేకపోయినా స్వయంకృషి, పట్టుదలే ఊపిరిగా చేసుకొని ఆదర్శవంతమైన జీవితంలోకి అడుగుపెట్టిన రాణి, ఎంతైనా అభినందనీయురాలు.

- కె.ఎస్.వి. రాజన్